క్లుప్తంగా

దుకాణాల తనిఖీ



పట్టణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు మండల లీగల్ సర్వీస్ అథారిటి, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో కలిసి కార్మిక శాఖ, అధికారులు బుధవారం దుకాణాలను తనిఖీలు చేశారు. పట్టణంలోని బీపీ అగ్రహారం వీధి, ప్రాజెక్ట్ వీధి, దర్గామిట్ట, పానగల్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, కొత్తపేట, బహుదూర్ పేటలోని దుకాణాలను విస్తృతంగా తనిఖీలు చేసి నలుగురు బాల కార్మికులను గుర్తించారు. నాలుగురు అడల్సేంట్ లేబర్ లను గుర్తించారు. తొట్టంబేడు మండలంలో పిచ్చాటూరు రోడ్డు–చెన్నై రోడ్డులో దుకాణాలను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ తిరుపతి చిన్నలాలప్ప, సహాయ కార్మిక అధికారి జి రంగనాథ్, తిరుపతి సహాయ కార్మిక అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, ప్రగతి స్వచ్ఛంద సంస్థ, న్యాయశాఖ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి



ఆటోల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆటో డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉండాలని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. ఆయన బుధవారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఆటోవాలాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోవాలాలు అన్ని రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, లేకుంటే జరిమానా విధిస్తామని తెలిపారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుంతలమయంగా తారురోడ్డు



ద్విచక్రవాహనదారులు పడిపోకుండా బారికేడ్

నాగలాపురం: పిచ్చాటూరు మండలం రామగిరి వద్ద తిరుపతి–చెన్నై జాతీయ రహదారి అధ్వాన్నంగా మారింది. దీంతో చిన్నపాటి వ్యాపారస్తులు, గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలవుతున్నారు. చెన్నై నుంచి రామగిరి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు గుంతలు ఉండడం గమనించక ప్రమాదాల పాలవుతున్నారు. అధికారులకు తెలిసినా కనీసం మరమ్మతులు కూడా చేయలేక పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని రామగిరి గ్రామస్తులు కోరుతున్నారు.

టిప్పర్లను మార్గం మళ్లించాలి



సత్యవేడు గాంధీ రోడ్డులో ధాస్తారాకో

సత్యవేడు: పీవీపురంలోని నాలుగు క్వారీల నుంచి కంకర, గ్రావెల్ సత్యవేడు మీదుగా తమిళనాడుకు తరలిస్తున్న 1000 టిప్పర్లను మరో మార్గంలో పంపాలని విముక్తి చిరుతలై పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్యాంసన్ కోరారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సత్యవేడులో నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ తమిళనాడు రాష్ట్ర సెక్రటరీ నీలవనత్తన్ మాట్లాడుతూ క్వారీ లారీలు అధిక టన్నేజీతో కంకర, మట్టి తరలిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్నారు. కంకర లారీలు సత్యవేడు మీదుగా వెళ్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయని ఆరోపించారు. రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు దుమ్ము భరించలేక అనారోగ్యం పాలవుతున్నారన్నారు. నాయకులు జార్జి ముల్లర్, చెంగయ్య, ధనుంజయులు, శ్రీరాములు, జి.వెంకటస్వామి, జీజ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు భరద్వాజ తీర్థంలో ఆరాధన

శ్రీకాళహస్తి: శ్రీ శివశంకర వేణుగోపాలస్వామి 47వ ఆరాధన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సభ్యులు గరికపాటి రమేష్ తెలిపారు. ఉదయం భరద్వాజ తీర్థంలోని ఆలయంలో అభిషేకపూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం తీర్థంలో కార్తీక వనభోజనం ఏర్పాటు చేస్తామని, సభ్యులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దిగుబడికి కాలిబాటలు



వరదయ్యపాళెం సీఎల్ఎస్‌పల్లిలో వరి పొలాల్లో కాలిబాటలు

- వరినాట్లలో మెళకువలు పాటిస్తున్న రైతులు
- చీడపీడల ఉధృతి తగ్గుతుందంటున్న అధికారులు

వరదయ్యపాళెం: రైతులు విత్తనం నాటే దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకూ ఎంత కష్టపడినా దిగుబడి అంతంతమాత్రమే వస్తుంది. కాస్త మెళకువలు పాటిస్తే అనుకున్న స్థాయిలో పంట దిగుబడిని పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వరి పంటలో కుదుళ్లను దగ్గరగా నాటడంతో పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. దీని నివారణకు నాట్ల సమయంలో కాలిబాటలు వేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని సత్యవేడు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీఏ సుబ్రమణ్యం వివరించారు. సత్యవేడు సబ్ డివిజన్ పరిధిలోని వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో ప్రస్తుతం రబీ సీజన్‌కు 14 వేల హెక్టార్లలో వరిసాగు చేయనున్నారు. ఒకప్పుడు వరినాట్లు ఎలా పడితే అలా వేసేవారు. కాలక్రమేణా రైతుల్లో అవగాహన పెరగడంతో కాలిబాటలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వరినాట్లు వేసే విధానం, కాలిబాటల వల్ల ఉపయోగం తదితర విషయాలను ఏడీఏ వివరించారు.

వరినాట్లు వేయడం ఇలా..

వరి కుదుళ్లను దుబ్బులుగా నాటొద్దు. దీని వల్ల పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందకపోవడంతో పంటకు చీడలు, పీడలు తొందరగా ఆశిస్తాయి. ప్రతి రెండు మీటర్ల నాట్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు తీయడంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి తెగుళ్ల ఉధృతి నుంచి కాపాడుకోవచ్చు. భూసారం ఎక్కువగా ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు, తక్కువగా ఉన్న పొలాల్లో ఎక్కువ కుదుళ్లు ఉండేలా నాటాలి. దగ్గరగా నాటడంతో మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్లు సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా దుబ్బులుగా నాటిన పంట పొలాల్లో ఎక్కువగా సుడిదోమ ఆశిస్తుంది.

ఉపయోగాలు అనేకం



కాలిబాటలతో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది. ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది. వరిలో కలుపును సులభంగా నియంత్రించవచ్చు. కిరణజన్య సంయోగ క్రియ అధికంగా జరిగి మొక్కల్లో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంట దిగుబడి పెరుగుతుంది. ఎలుకలను సమర్థవంతంగా అదుపు చేయవచ్చు. కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా పంట పొలాల్లో తెగుళ్ల ఉధృతిని పరిశీలించడానికి కాలిబాటలు దోహదపడతాయి.

సుబ్రమణ్యం, ఏడీఏ, సత్యవేడు సబ్ డివిజన్

త్వరలోనే హోమియో వైద్యుడి నియామకం

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని హోమియోపతి ఆస్పత్రికి త్వరలోనే వైద్యుడిని నియమిస్తామని రాష్ట్ర ఉప సంచాలకులు ధనుంజయరావు తెలిపారు. ఈ నెల 3వ తేదీన సాక్షి దినపత్రికలో హోమియో ఆస్పత్రికి అటెండరే దిక్కు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర ఉపసంచాలకులు ధనుంజయరావు ఓ ప్రకటనలో స్పందించారు. హోమియో వైద్యశాలలో సిబ్బంది కొరత ఉండడంతో ఏపీపీఎస్సీకి వైద్యాధికారుల నియామకాలు ఇచ్చామని, ఏపీపీఎస్సీ నియామకం కోర్టులో ఉందని తెలిపారు. అది పరిష్కారమైన వెంటనే సిబ్బంది కొరత తీరుతుందన్నారు. సిబ్బంది నియామకం అయ్యాక రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్‌ను నియమిస్తామని తెలిపారు. అప్పటి వరకు బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలోని హోమియో వైద్యశాలలో పారామెడికల్ సిబ్బంది నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: సినిమా డైరెక్టర్ వెంకీ అట్లూరి, సినీ నటులు సాయిదుర్గ తేజ్, దగ్గుబాటి అభిరామ్, రఘు, సప్తగిరి, అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు.

నైపుణ్య గణనపై శిక్షణ



మాట్లాడుతున్న ఎపీఎస్ఎస్‌డీసీ జిల్లా కో–ఆర్డినేటర్ చాను

బుచ్చినాయుడుకండ్రిగ: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణన–2024పై గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపీఎస్ఎస్‌డీసీ జిల్లా కో–ఆర్డినేటర్ చాను మాట్లాడుతూ 15 నుండి 59 సంవత్సరాల వయస్సు మధ్యలో వారి నైపుణ్యాలను నైపుణ్య గణన–2024 సర్వే ద్వారా గుర్తించాలని తెలిపారు. నైపుణ్య గణన–2024 ను గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పక్కాగా చేయాలన్నారు. నైపుణ్య గణనకు ప్రజలందరూ సహకరించి, యువత భవితకు బాటలు వేయాలని తెలిపారు. ఇంటింటా నైపుణ్య గణన యువత భవితకు భరోసా లభిస్తుందన్నారు.

గోకులం షెడ్ల పనులు పూర్తి చేయాలి

నాగలాపురం: గోకులం పథకంలో పశువుల షెడ్లు మంజూరైన లబ్ధిదారులు ఈ నెల 25వ తేదీలోపు నిర్మాణ పనులు పూర్తి చేయకుంటే వాటిని రద్దు చేస్తామని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. మండలలోని గోకులం షెడ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అన్ని పనులకు త్వరితగతిన బిల్లులు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఏపీఓ సుధాకర్, ఈసీ సురేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దు

వరదయ్యపాళెం: మండలంలోని రాచకండ్రిగ సమీపంలోని ఓ ప్రైవేటు గృహ సముదాయాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటు చేయెుద్దని ఆ ప్రాంత స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మద్యం దుకాణం ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలనకు వచ్చిన ఎక్సైజ్ సీఐ దశరథరామిరెడ్డికి స్థానిక ప్రజలు వినతిపత్రం ద్వారా తమ అభ్యంతరాన్ని విన్నవించారు. వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, ఇతర కార్మికులు పలువురు నివాసమున్న ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో అనేక ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని వారు సీఐ ఎదుట వాపోయారు. మద్యం దుకాణం ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే నిరంతర ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని స్థానిక ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు.



నాగలాపురం ఎక్సైజ్ సీఐకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాచకండ్రిగ గ్రామస్తులు

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

నారాయణవనం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అటవీ ప్రాంతంలో నీటి నిల్వకు తవ్వుతున్న ట్రెంచ్‌లను ఆయన పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీకి వంద రోజులపాటు పని కల్పించాలని ఆదేశించారు. పని చేసే ప్రాంతంలో కూలీలకు మౌలిక సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించడంలో శ్రద్ధ చూపాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఉపాధి నిధులతో నిర్మిస్తున్న కాటిల్ షెడ్లను, సీసీ రోడ్లను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయించాలని అన్నారు. ఆయనతో ఏపీఓ సుకన్య, ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పనులను పరిశీలించారు.

తిరుపతిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ రేపు

తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శుక్రవారం తిరుపతిలో పాత తిరుచానూరు రోడ్డులోని తమ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే ఈ అదాలత్‌లో ముఖ్య అతిథులుగా విద్యుత్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్ హాజరవుతారని, తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని టౌన్–1, టౌన్–2, టౌన్–3, రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్బంధ శిక్షణ పేరుతో టీచర్లను శిక్షించొద్దు

తిరుపతి ఎడ్యుకేషన్ : నిర్బంధ శిక్షణ పేరుతో టీచర్లను శిక్షించడం తగదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవి.సత్యనారాయణలు ఓ సంయుక్త ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ యుగంలోనూ రెసిడెన్షియల్ శిక్షణ పేరుతో వారం పాటు టీచర్లను కుటుంబానికి దూరం శిక్షణ పేరిట మరింత ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నా ప్రపంచ బ్యాంకు నిధులు ఆగిపోతాయన్న కుంటి సాకులతో ఉన్నతాధికారులు ఏకపక్షంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇలాంటి శిక్షణలకు స్వస్తి పలకాలని, అవసరమైతే ఆన్‌లైన్‌లో, అలాగే ఉపాధ్యాయులకు వీలుగా మండల కేంద్రాల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు తొట్టంబేడు విద్యార్థి ఎంపిక



జ్ఞానచరణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: మదనపల్లెలో నిర్వహించిన జిల్లా అండర్–14 వాలీబాల్ క్రీడల్లో తొట్టంబేడుకు చెందిన జ్ఞాన చరణ్ బాలురు విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇతడు తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9తరగతి చదువుతున్నాడు. అతడిని ప్రధానోపాధ్యాయుడు పి.సుబ్రమణ్యం అభినందించారు. విజయనగరం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీలో జ్ఞానచరణ్ పాల్గొంటాడని తెలిపారు. అతడిని హెచ్‌ఎంతో పాటు టీచర్లు, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పోటీ పరీక్షలపై అవగాహన



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న వక్తలు

శ్రీకాళహస్తి: స్వామి విద్యాప్రకాశానంద డిగ్రీ కళాశాలలో జేకేసీ, కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్ సంబంధించి బుధవారం అవగాహన సదస్సు సెట్విన్, కౌటిల్య ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షల గురించి, వాటికి ఎలా ప్రిపేర్ అవ్వాలి? ఆ పరీక్షలు రాయాలంటే ఉండాల్సిన అర్హతలు..ఇత్యాది అంశాలను వివరించారు. ఈ సదస్సు విద్యార్థులకు ఎంతగానో దోహద పడిందని ప్రిన్సిపల్ నరసింహవర్మ అన్నారు. కార్యక్రమంలో ఐక్యు కో–ఆర్డినేటర్ డాక్టర్ బాపనయ్య, జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ గంగారం, సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్, క్వాలిటీ ఇన్‌స్టిట్యూషన్ మేనేజర్ ఎస్ఎస్ రెడ్డి, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొంది.

కూటమి ప్రభుత్వంపై పోరాటాలకు ‘శంఖారావం’



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు



ప్రాంతీయ కార్యదర్శిగా ఎన్నికైన గంధం మణి

- సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో మీనమేషాలు
- కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పెచ్చరిల్లిన నేరాలు
- నేరాల కట్టడికి బదులు సనాతన ధర్మం అంటూ ఊగిపోతున్న పవన్ కళ్యాణ్
- సీపీఎం ప్రాంతీయ మహాసభ విమర్శ

శ్రీకాళహస్తి: ప్రజా సమస్యల పరిష్కారం..కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీల సాధనకు అలుపెరుగని పోరాటం చేయాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ పిలుపునిచ్చింది. క్షేత్ర స్థాయి నుంచే దోపిడీ, అంటరానితనం, మతోన్మాదాన్ని అడ్డుకునేలా భవిష్యత్ పోరాటాలకు శంఖారావం పూరిస్తున్నట్లు ప్రకటించింది. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ ప్రప్రథమ మహా సభ నిర్వహించారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం, అర్బన్, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల సీపీఎం శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ సర్కిల్ నుంచి సుందరయ్య భవన్ వరకు ప్రజానాట్యమండలి కళాకారుల డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పై విధంగా మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో కూటమి సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు.ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సోషల్ మీడియాలో అశ్లీలత, మాదక ద్రవ్యాల విచ్చలవిడితనం వల్ల యువత పెడదోవ పడుతోందని, ఫలితంగా సమాజంలో నేరాలు పెచ్చుమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు నానాటికీ పెరిగిపోతూంటే కట్టడి చేయాల్సిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహచర హోం మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన బీజేపీ చేతుల్లో కీలుబొమ్మగా మారి ‘సనాతన ధర్మం’ అంటూ తెగ ఊగిపోతున్నారని మండిపడ్డారు. అగ్రరాజ్యం అమెరికా తమ వ్యాపారాభివృద్ధికోసం దేశాల మధ్య యుద్ధాలు సృష్టించి నరమేధానికి తెరతీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిక్స్ దేశాలు అమెరికా తీరును ఎండగట్టడం శుభపరిణామమన్నారు. భారత దేశాన్ని తమ నియంత పోకడలతో పాలించాలని బీజేపీ జమిలి ఎన్నికలను తెరపైకి తెస్తోందని దుయ్యబట్టారు. అనంతరం సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాంతీయ కార్యదర్శిగా గంధం మణి, సభ్యులుగా పెనగడం గురవయ్య, ధనంజయలు, కుమార్, వెంకటేష్, రాధమ్మ, శ్రీనివాసులు, రమణయ్య ఎన్నికయ్యారు. సీపీఎం నేతలు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్ల గుంటలో పిచ్చి మొక్కలు



రేణిగుంట మంచినీళ్ల గుంట వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు



రాతి బల్లల చుట్టూ పెరిగిన మొక్కలు, గడ్డి

- పాముల చేరికతో భయం..భయం
- వాకింగ్ ట్రాక్‌పై నడిచేందుకు భయపడుతున్న మహిళలు

రేణిగుంట: పట్టణ నడిబొడ్డున ఉన్న మంచినీళ్లగుంటను గత ప్రభుత్వ హయాంలో తుడా నిధులతో అభివృద్ధి చేసి చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించారు. వాకింగ్ ట్రాక్ పక్కన అక్కడక్కడా కూర్చుని సేద తీరేందుకు రాతిబల్లలు సైతం ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి మహిళలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళ వాకింగ్ చేసేవారు. అయితే కొన్ని నెలలుగా మంచినీళ్ల గుంట నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో లోపల, వాకింగ్ ట్రాక్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో అక్కడ పాములు చేరాయి. దీంతో వాకింగ్ ట్రాక్‌పై నడిచేందుకు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాకింగ్ ట్రాక్, రాతి బల్లల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనుల సమస్యలపై ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి

తిరుపతి కల్చరల్: జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్‌ను బుధవారం సాయంత్రం పద్మావతి అతిథి గృహంలో గిరిజన సంఘ నేతలు వినతి పత్రం ఇచ్చారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్, ఏకలవ్య ఎరుకుల సంఘం జిల్లా నేతలు చీరాలయ్య, ఈశ్వరమ్మ ఆయనకు సమస్యలు నివేదించారు. జిల్లాలో దొరవారి సత్రం–చిల్లమూరు, ఓజిలి, రేణిగుంట మండలాల్లో గిరిజనులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

సూళ్లూరుపేట దొరవారిసత్రం మండలం తనియాలి ఎస్టీ కాలనీలో 100 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దొరవారిసత్రం మండలం, మినుముల మోడీ ఎస్టీ కాలనీ గిరిజనులు వంద ఎకరాలు సాగు భూమిగా తీర్చిదిద్దుకున్నా వారికి పట్టాలు ఇవ్వలేదని, అలాగే అదే మండలంలోని కల్లూరు ఎస్టీ కాలనీలో 135 ఎకరాలు 40 కుటుంబాలకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు భూమి పంపిణీ చేయలేదని, పట్టాలు ఇవ్వలేదని వాపోయారు.